నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా సాయిబాబా టెంపుల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సీతాపతి కాలనీ, సామ్రాట్, క్రిష్ణానగర్, లక్ష్మీనగర్, ఇషాక్ కాలనీ, రైల్ కాలనీ, సుబ్బారావు కాలనీ ఎంఎస్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. అదేవిధంగా తుర్కపల్లి ఆకాష్ క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని మా సంతోషి కాలనీ, తుర్కపల్లి విలేజ్, కళాసిగూడ, రాధ సాయిసంఘ్, బ్లూ బర్డ్స్ కాలనీ, రైల్వే కాలనీ, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు లలితా నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లలితానగర్, క్రిష్ణపురి కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలనీ, మధ్యాహ్నం 3 నుంచి ఐదు గంటల వరకు ఎల్‌ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలోని వైడబ్ల్యూసీఏ జడ్జ్ క్వార్టర్స్, సరస్వతి కాలనీ, బూసారెడ్డి గూడ, కోర్టు ఏరియా, ఫిషర్ పురా, గాంధీకాలనీ, ఎల్ఐసీ కాలనీ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 32, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 21, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎలక్ట్రిక్ ఆటో విరాళం



గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో రోగి సహాయకుల విశ్రాంతి కేంద్రం నిర్వహణ, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్న జనహిత సేవా ట్రస్ట్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా ఎలక్ట్రిక్ ఆటోను విరాళంగా అందించింది. ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ద్వారా రూ. 5 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటో వాహనాన్ని బ్యాంకు అధికారులు జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులకు అందించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా జీఎం రితేష్‌కుమార్, హైదరాబాద్ జోన్ డీజీఎం సుధాకర్, మెట్రోరీజియన్ డీజీఎం ఆదిత్య పాల్గొన్నారు.

ఓయూలో లహుజి సాల్వే వర్ధంతి



లహుజి సాల్వే చిత్రపటానికి మాంగ్‌ల నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో లహుజి సాల్వే 144వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ ముఖ్యఅతిథిగా హాజరై లహుజి సాల్వే చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త లహుజి సాల్వే జీవిత చరిత్రను నేటి తరం తెలుసుకునే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే శంకర్ మాంగ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి



మృతుడు దాస్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ ప్రముఖ ఆకుకూరల వ్యాపారి జె. దాస్(63) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దాస్ మరణవార్త తెలియగానే మోండా మార్కెట్ వ్యాపారులు, వర్తకులు పెద్ద ఎత్తున బోయిగూడలోని ఆయన నివాసానికి చేరుకొని పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. దాస్ మరణంతో మోండా మార్కెట్, బోయిగూడ ప్రాంతాల్లో విషాఛాయలు నెలకొన్నాయి.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కాచిగూడ: లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అందజేశారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, నేతలు ప్రియారాజ్, సంజీవరెడ్డి, అశ్విన్, ఓంప్రకాష్, మోసిన్, జైస్వాల్, సందీప్, శివ, శేఖర్, తాహిర్, జగదీష్, పాషా పాల్గొన్నారు.

రెండోసారి 'ప్రజాపాలన'

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అట్టహాసంగా ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించింది. ఆ దరఖాస్తులను కంప్యూటరేజేషన్, సర్వే పేరిట 14 నెలలు కాలం గడిపారు. అయితే దరఖాస్తు చేసుకోని వారికి మళ్లీ అవకాశం ఇవ్వడానికి ఫేజ్–2 మొదలు పెట్టింది. ఆదివారం నుంచి వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమైంది. మొదటి రోజు 153 మంది దరఖాస్తులు అందజేశారు.



బౌద్ధనగర్ డివిజన్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

- మొదటి రోజు దరఖాస్తులు 153
- ఈనెల 28 వరకు దరఖాస్తుల స్వీకరణ

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ డివిజన్‌ల వార్డు కార్యాలయాల్లో సేవా కేంద్రాలను ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ప్రారంభించారు. తొలిరోజు మొత్తం 150 దరఖాస్తులు స్వీకరించినట్టు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. ఈనెల 28 వ తేదీ వరకు సేవా కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. లోగడ ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఇంటింటి సర్వే నిర్వహించిన అధికారులు వారి వాస్తవ పరిస్థితుల వివరాలు సేకరించారు. ఇప్పటికీ దరఖాస్తులు చేసుకోనివారి నుంచి ప్రజాపాలన–ఫేజ్2లో భాగంగా వార్డు కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు అందించాలని కోరుతున్నారు.

85 శాతం పూర్తి..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిర్వహించిన సోషియో ఎకనామిక్ సర్వే ద్వారా 83 శాతం వరకు మాత్రమే వివరాలు రాబట్టగలిగారు. డోర్‌లాక్, దరఖాస్తు చేసుకున్న వారు నిర్దేశిత చిరునామాల్లో నివాసం లేకపోవడం, ఇంకొందరు వివరాలు అందించక పోవడం తదితర కారణాలతో 17 శాతం మంది ప్రజల వివరాలు రాలేదు. దీంతో వారికి మరో అవకాశం కల్పించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

27 వార్డు కార్యాలయాల్లో..

ఉత్తర మండలంలోని ఐదు సర్కిళ్ల పరిధిలో గల 27 వార్డు కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ప్రతీ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో శిక్షణ పొందిన ఆపరేటర్లను నియమించారు. స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దరఖాస్తు దారుల నుంచి సమగ్రంగా వివరాలు రాబట్టి నమోదు చేసే కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఇంటింటి సర్వే ద్వారా సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలు

సర్కిల్	మొత్తం గృహాలు	వివరాలు సేకరించినవి	ఆన్‌లైన్ శాతం
సికింద్రాబాద్	79,550	68,426	86.02
బేగంపేట్	59,779	42,034	70.32
అంబర్‌పేట్	78,720	70,059	89.00
ముషీరాబాద్	66,242	58,671	88.57
మల్కాజిగిరి	1,20,630	1,01,150	83.85

సద్వినియోగం చేసుకోవాలి



లోగడ నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారంతా జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో ప్రారంభించిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వివరాలు, వృత్తి, చిరునామా తదితర వివరాలను అందించాలి. కుటుంబ సామాజిక పరిస్థితుల ఆధారంగా పేర్లు నమోదు చేసుకున్న వారిని మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హతల ప్రాతిపదికన అర్హులుగా ఎంపిక చేస్తారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందగోరు వారు అందరు దళారులను ఆశ్రయించకుండా నేరుగా వార్డు కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు అందజేయాలి

–జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్

పార్టీలకతీతంగా కంటోన్మెంట్ అభివృద్ధి

ఎమ్మెల్యే శ్రీగణేశ్



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: పార్టీలకతీతంగా కంటోన్మెంట్ అభివృద్ధికి పాటుపడదాం అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ పిలుపునిచ్చారు. ఆరోవార్డు టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్‌లో రూ.37.6 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించిన పరిహారం సొమ్ము రూ.303 కోట్లు కేంద్రం ఖాతాలోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతం పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉన్న నాటి ఎంపీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, గతంలో కంటోన్మెంట్ సీఈఓగా పని చేసి, ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యదర్శిగా ఉన్న అజిత్ రెడ్డి కృషి వల్లే ఇది సాధ్యం అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించడంతో కంటోన్మెంట్‌కు రూ.303 కోట్ల మేరకు నిధులు అందుతున్నాయన్నారు.

◆ గతంలో తనకు బీజేపీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఇప్పించినందుకు బోర్డు సభ్యుడు రామకృష్ణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కారణంగానే తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తాను కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు అవకాశం దక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన టీపీటీ చార్జీలతో పాటు అన్ని విభాగాల నుంచి నిధులు తెప్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు. రామకృష్ణతో పోల్చుకుంటే తాను ఎక్కువగా చదువుకోలేదని, రాజకీయ అనుభవం కూడా లేదన్నారు. అయినప్పటికీ ఈ ప్రాంత సమస్యలపై ప్రత్యేక అవగాహన ఉందని, రాష్ట్ర మంత్రులతో ఉన్న సాన్నిహిత్యంతో కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు రాబడతానన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోలపాల చారి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు బానుక నర్మద మల్లికార్జున్, సాద కేశవరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే కంటి సమస్యలు గుర్తించాలి



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ రవిశేఖరరావు

గాంధీఆస్పత్రి: ప్రాథమిక దశలోనే అంధత్వ సమస్యలు గుర్తించి సరైన వైద్యం అందిస్తే నివారణ, నియంత్రణ సులభమని గాంధీ అప్తమాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రవిశేఖరరావు అన్నారు. గాంధీఆస్పత్రి అప్తమాలజీ విభాగంలో సీతాఫల్‌మండి, లాలాపేట, అంబర్‌పేట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు సోమవారం వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవిశేఖరరావు మాట్లాడుతు కంటిచూపు, రెటీనా, కనుపాప, మెల్లకన్ను, కంటినరాలకు సంబంధించిన పలు వైద్యపరీక్షలు నిర్వహించి, తగిన మందులు, అద్దాలు అందించామన్నారు. శిబిరం మార్చి 7 వరకు కొనసాగుతుందని వివరించారు. గాంధీ అప్తమాలజీ వైద్యులు సుజనీ, ప్రావీణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'గాంధీ'లో స్కిల్‌ల్యాబ్ ప్రారంభం



స్కిల్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న 'గాంధీ' అధికారులు

గాంధీఆస్పత్రి: వైద్య విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యం మరింత పెంపొందించుకునేందుకు స్కిల్ ల్యాబ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు వైద్యనిపుణులు అన్నారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ ల్యాబ్‌ను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల ప్రొఫెసర్ ఇందిర, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనరల్ సర్జరీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పీజీ) విద్యార్థులు లాప్రోస్కోపీ, ఆపరేషన్ అనంతరం కుట్లు వేయడం తదితర అంశాలపై మరింత ప్రావీణ్యత సాధించేందుకు స్కిల్‌ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గాంధీ జనరల్ సర్జరీ హెచ్ఓడీ ప్రొఫెసర్ రాజారామ్, వైస్‌ప్రిన్సిపాల్ రవిశేఖరరావు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



స్పీకర్‌కు వినతి పత్రం అందచేస్తున్న బీసీ నేత జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. బీసీల జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషను కల్పిస్తూ శాసన సభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు ఈడిగ శ్రీనివాస్, బూర శ్రీనివాస్, గోదా రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



స్వర్ణలతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న క్రైస్తవ, మాల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు విజయ్ కుమార్ పిడుగు సతీమణి స్వర్ణలతను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. కిడ్నీ ఆపరేషన్ అయ్యి బల్కంపేటలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రంగులు మార్చి..

బెంజ్ కారును సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు



రంగు మార్చిన బెంజ్ కారును సీజ్ చేస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: మోటార్ వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా రంగులు మార్చి, మోడిఫై చేసిన బెంజ్ కారును జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నిబంధనలకు విరుద్ధంగా కారును ఆధునీకరించిన సంస్థతో పాటు, కారు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–36లో నివసించే సుజిత్ వసంత్ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల అతను తెలుపు రంగు మెర్సిడెస్ బెంజ్ కారును కొనుగోలు చేశాడు. అయితే తన కారు ప్రత్యేకంగా ఉండాలనే ఉద్దేశంతో అతను కారును బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12లో ఆధునీకరించాడు. గ్రీన్, ఎల్లో షేడ్స్‌లో కారును ప్రత్యేకంగా తీర్చిదిద్ది నగర రహదారులపై తిరుగుతున్నాడు. ఈ నెల 11న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోపీ వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదుపు తప్పిన వేగంతో నెంబర్ ప్లేట్ లేకుండా దూసుకెళ్తున్న కారును ఆపారు. కారు పత్రాలు తనిఖీ చేసిన పోలీసులు కలర్ మార్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సుజిత్ వసంత్‌తో పాటు కారును మోడిఫై చేసిన సంస్థపై ఎంవీ యాక్ట్ కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం షోరూం నుంచి రోడ్డెక్కిన ఏ వాహనమైనా మోడిఫై చేయాలంటే ఆర్టీఏ అధికారుల అనుమతి తప్పనిసరి. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నెంబర్ ప్లేట్ లేకుండా ఇంద్రధనుస్సు రంగుల్లో కారును తయారుచేసుకుని తిరుగుతున్నట్లు తేల్చారు. అనధికారికంగా కారు రంగు మార్చిన డెకార్ షోరూంపై, కారు యజమాని సుజిత్‌పై రూ.లక్ష జరిమానాతో పాటు ఎంవీయాక్ట్ కింద కేసు నమోదు చేసి కారును సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ అంటూ టోకరా

బంజారాహిల్స్: తాను బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నానని ఓ యువకుడిని నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కూకట్‌పల్లికి చెందిన జ్ఞానసాయి ప్రసాద్(28) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. గతేడాది మేలో స్నేహితుడితో బంజారాహిల్స్‌లోని నీలోఫర్ హోటల్‌లో వ్యాపారం గురించి చర్చిస్తున్నాడు. ఆ వెనుకనే కూర్చొని వీరి మాటలు వింటున్న ఓ వ్యక్తి సాయి ప్రసాద్ వద్దకు వచ్చి తాను ఐసీసీసీలో టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తుంటానని పరిచయం చేసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత సాయిప్రసాద్‌కు ఫోన్ చేసి తన పేరు గోవర్ధన్‌గా చెప్పాడు. నీలోఫర్ హోటల్‌కు రావాలంటూ పిలిచాడు. ఓ హోటల్ బిజినెస్‌లో రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించాడు. అప్పటికప్పుడే సాయి ప్రసాద్ రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చి మిగతా మొత్తాన్ని గూగుల్ పే చేశాడు. మొత్తం రూ. 2.80 లక్షలు చెల్లించాడు. పలుమార్లు హోటల్ వ్యాపారం గురించి గోవర్ధన్‌ను ప్రశ్నిస్తుండగా దాటవేస్తూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన సాయి ప్రసాద్ ఐసీసీసీలో వాకబు చేశాడు. అలాంటి వ్యక్తి ఇక్కడ ఎవరూ పనిచేయడం లేదని అధికారులు తెలపడంతో మోసపోయానని తెలుసుకొని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గోవర్ధన్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

వాడవాడలా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు



మాజీ మంత్రి హరీశ్ రావుకు విరాళం అందజేస్తున్న బోర్డు మాజీ సభ్యుడు



పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేస్తున్న బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ



పద్మారావునగర్‌లో..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఎక్కడికక్కడ భారీ ఎత్తును ఫ్లెక్సీలు, జెండాలు కట్టి కూడళ్లను గులాబీమయం చేశారు. పార్టీ శ్రేణులు,నాయకులు ఆయా ప్రాంతాల్లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



కార్ఖానాలోని వృద్ధాశ్రమంలో మందులు, పండ్లు పంపిణీ



బన్సీలాల్‌పేట్‌లో..



బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..



పికెట్ చౌరస్తాలో..

నిమ్స్‌కు 15 వీల్‌చైర్ల వితరణ

లక్డీకాపూల్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వీల్ చైర్లు వితరణ చేశారు. సోమవారం నిమ్స్ ఆవరణలో ఆయన తన సోదరుడు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి నిమ్స్ కు 15 వీల్ చైర్లను అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మి భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ పరిసరాలను పరిశీలించిన ఆయన ఆస్పత్రి మెయిన్ గేటు వద్ద రూ.50లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ నిర్మించనున్నట్లు భూపాల్ రెడ్డి తెలిపారు.

బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని మహాత్మా గాంధీ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఆదివారం బేగంపేటలో పోటీలను నిర్వహించారు. ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు అండర్–14 బాలుర విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. అండర్–10 బాల బాలికల విభాగాల్లో కన్సోలేషన్ బహుమతులు పొందారు. సోమవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ఎం.ఎం. నాయుడు విద్యార్థులను అభినందించారు.